క్లుప్తంగా

బాలింతలు పౌష్టికాహారం విధిగా తీసుకోవాలి

నింద్ర: బాలింతలు, కిషోర బాలికలు ప్రతి నిత్యం విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ శ్యామల అన్నారు. సోమవారం మండలంలోని అరూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, కిషోర బాలికలు ఆహారం తీసుకునే విధానాలు, పరిసరాలు పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాతకు అభినందన


హరికృష్ణారెడ్డిని అభినందిస్తున్న కలెక్టర్

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని సాదరిపల్లెకు చెందిన అభ్యుదయ రైతు హరికృష్ణారెడ్డిని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అభినందించారు. ఆదివారం గణతంత్ర వేడుకల సందర్భంగా చిత్తూరు పోలీస్ పరేడ్ మైదానంలో హరికృష్ణారెడ్డికి వ్యవసాయ పరికరాలను మంజూరు చేశారు. పులిగుంటీశ్వర ప్రకృతి ఉత్పత్తిదారుల కంపెనీ స్థాపించి రైతులకు విశేష సేవలందిస్తున్నందుకు ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, ఏడీ కోటేశ్వరరావు, డ్రోన్ టెక్నాలజీ నిపుణుడు సాయి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోష పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామివారికి సోమవారం ఘనంగా ప్రదోష కాల పూజలు నిర్వహించారు. అలాగే నందీశ్వరునికి సైతం ఏకకాలంలో అభిషేకం జరిపించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం నందీశ్వరునికి క్షీరాభిషేకం చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వినతులపై ప్రత్యేక దృష్టి


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ లోకనాథపిళ్లై

శ్రీరంగరాజపురం (కార్వేటినగరం): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తహసీల్దార్ లోకనాథపిళ్లై తెలిపారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు మొత్తం 21 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. ఆయా వినతులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

తాగునీటి సమస్య పరిష్కారం


బోరు డ్రిల్ చేయిస్తున్న సర్పంచ్ గోవిందయ్య

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ యూకే మర్రిపల్లెలో తాగునీటి సమస్యను సర్పంచ్ చొక్కా గోవిందయ్య పరిష్కరించారు. సోమవారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామంలో బోరు వేయించగా పుష్కలంగా నీరు పడినట్లు వెల్లడించారు. వెంటనే మోటారు అమర్చి ప్రజల దాహార్తిని తీర్చేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

నేడు హైవే విస్తరణపై సమావేశం

నగరి: జాతీయ రహదారి 205 చెన్నై సెక్షన్ 716, 71 తిరుపతి–తిరుత్తణి రోడ్డు నిర్మాణంలో నగరి మున్సిపల్, మండల పరిధిలో ప్రభావం చూపే ఆలయాలు, మండపాలు, ఆర్చిలు, శిలావిగ్రహాలకు సంబంధించిన సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించనున్నారు. సంబంధీకులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆర్డీఓ భవానీ శంకరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థినికి ప్రశంసలు


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

నగరి: ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలో స్థానిక పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల బైపీసీ విద్యార్థిని ఎస్.ఉమ తృతీయ స్థానాన్ని పొందింది. ప్రతిభ చూపిన విద్యార్థిని, ప్రోత్సాహం అందించిన అధ్యాపకురాలిని సోమవారం కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలపతి అభినందించారు.

గ్రామీణులకు వైద్య సేవలు

పాలసముద్రం: మండలంలోని బలిజూరు, వీర్లగుడిలో సోమవారం 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించారు. వైద్యాధికారి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమన్నారు. అనంతరం 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ సుశీల, ఎంపీహెచ్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నాం..
అందినంతా దోచేద్దాం...


గుట్ట వద్ద తొలగించిన ఆక్రమణల వద్ద టీడీపీ జెండా


తొలగించిన ఆక్రమణల వద్ద జనసేన జెండా

నేనీ పక్క, నువ్వా పక్క ఈ గుట్టమ్మ కలిపింది ఇద్దరినీ... అంటూ ఎంచక్కా టీడీపీ, జనసేన నాయకులు పుత్తూరు పట్టణంలోని మరాఠిగేట్ గుట్టను పంచేసుకుంటున్నారు. వీరి అధికార అహంకారానికి నిలువెత్తు నిదర్శనంగా ఆక్రమణల వద్ద ఏకంగా పార్టీ జెండాలనే నాటారు. విషయం తెలుసుకొన్న స్థానికులు తహసీల్దారుకు సమాచారం అందించడంతో పోలీసుల సహాయంతో రెవెన్యూ అధికారులు ఆక్రమణలను అడ్డుకొన్నారు. ఎంత అధికారంలో ఉంటే మాత్రం ఇంత బరితెగింపా అంటూ స్థానికులు చర్చించుకొంటున్నారు.


రెవెన్యూ సిబ్బందితో వాదనకు దిగిన కూటమి నాయకులు

- మరాఠిగేట్ గుట్ట ఆక్రమణకు 'కూటమి' యత్నం
- ఆక్రమణల వద్ద టీడీపీ, జనసేన పార్టీల జెండాలు
- మట్టిని తరలిస్తూ, పాకలు వేసి కబ్జాకు స్కెచ్
- టీడీపీ, జనసేన నాయకుల నిర్వాకం

పుత్తూరు: ఊరు మనదే దోచేయ్... అన్న సినిమా డైలాగ్‌ను గుర్తు తెప్పించేలా కూటమి నేతలు మసలుకుంటున్నారు. మొన్నటికి మొన్న ఆరేటమ్మ గుట్ట, నేడు మరాఠిగేట్ గుట్ట.. కనిపించిందల్లా కబ్జా చేసెయ్ అంటూ కూటమి నాయకులు రెచ్చిపోతున్నారు. పుత్తూరు పట్టణ పరిధిలోని మరాఠిగేట్ గుట్ట వద్ద తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు ఆక్రమణలకు పాల్పడ్డారు. గుంజలు నాటి, పాకలు వేస్తూ, పార్టీ జెండాలను సైతం నాటారు. పట్టణ పరిధిలోని నంది మంగళం రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నెంబర్ 199లో పూరా విస్తీర్ణం 597.81 ఎకరాలు. ఇందులోనే మరాఠిగేట్ గుట్ట, ఎన్జీఓ కాలనీ, ఎన్టీఆర్ కాలనీలతోపాటు, కోనేటిపాళెం గుట్టలు సైతం విస్తరించి ఉన్నాయి. మరాఠిగేట్ గుట్టను ఆనుకొని అమరావతి లేఅవుట్‌కు వెళ్లే రోడ్డు సైతం ఉంది. ఈ రోడ్డును ఆనుకొని ఉన్న గుట్ట నుంచి గత కొన్ని నెలలుగా మట్టిని తరలిస్తూ అక్రమంగా దోచేస్తున్నారు. గుట్టను తవ్వేస్తున్నారంటూ స్థానికులు అడ్డు చెప్పినా, అధికార బలంతో మట్టి తరలింపులను కొనసాగిస్తూ వచ్చారు. మట్టి తరలింపులతో ఏర్పడిన ఖాళీ స్థలాలపైనా కూటమి నాయకుల కన్ను పడింది. అనుకొన్నదే తడవుగా కూటమి నాయకులు ఏకంగా పాకలు వేస్తూ, తెలుగుదేశం, జనసేన పార్టీ జెండాలను నాటారు. దీంతో స్థానికులు తహసీల్దారుకు విషయం తెలియజేసి, ఆక్రమణలు అడ్డుకోకపోతే ఆందోళన చేస్తామంటూ అల్టిమేటం ఇచ్చారు.

ఆక్రమణలను అడ్డుకొన్న రెవెన్యూ శాఖ

మరాఠిగేట్ గుట్ట వద్ద అక్రమంగా మట్టి తరలింపు, ఆక్రమణలపై స్థానికులు ఇచ్చిన సమాచారంపై వెంటనే స్పందించిన తహసీల్దార్ వెంకటేశ్వర్లు సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించారు. అక్కడ టీడీపీ, జనసేన నాయకులు, రెవెన్యూ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసుల సాయంతో ఆక్రమణలను తొలగించారు.


గుట్టపై కూటమి నాయకులు నాటిన కూసాలు

ఆక్రమణలకు పాల్పడితే కేసులు తప్పవు



గుట్టల వద్ద ఆక్రమణలకు పాల్పడితే కేసులు తప్పవు. సర్వే నెంబర్ 199లోని మరాఠిగేట్ వద్ద గల సదరు స్థలం ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌కు కేటాయించబడింది. ఇందులో ఎవరు ప్రవేశించినా చట్టరీత్యా చర్యలు తప్పవు. నిజంగా అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కావాలంటే అర్జీలు ఇస్తే, పరిశీలించి, కేటాయిస్తాం. ఆక్రమణలకు పాల్పడితే మాత్రం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

–జీసీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు

సస్యరక్షణతో అధిక దిగుబడులు


ఉద్దుల పంట

నింద్ర: మండలంలోని రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన ఉద్దులు, పెసర పంటలకు సస్యరక్షణ చేపట్టాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. సోమవారం నెట్టేరి, మిట్టూరు గ్రామాల్లో ఉద్దులు, పెసలు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రైతులు వర్షాలు పడుతుండడంతో పంటలో చీడపీడలను గుర్తించి రైతులు సస్యరక్షణ చేపట్టాలని సూచించారు. ఆకులు రంగు మారడాన్ని గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఎకరాకు క్లోరిపైరిఫాస్ 500 మి.లీ, మాంకోజెబ్ 200 గ్రాములు కలిపి పిచికారీ చేస్తే చీడలను నివారించ వచ్చునని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నేడు హెల్మెట్ ధారణపై అవగాహన

నగరి: 36వ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం హెల్మెట్ ధారణతో కలిగే లాభాలపై నగరిలోని ద్విచక్ర వాహన విక్రయాల సబ్ డీలర్లు, ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీఓ వాసుదేవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి


తాగునీటి ట్యాంకు ప్రారంభిస్తున్న సర్పంచ్ ధనుంజయవర్మ

కార్వేటినగరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పంచాయతీలు అభివృద్ధి పథంలో పయనించాయని సర్పంచ్ ధనంజయవర్మ తెలిపారు. సోమవారం స్థానిక గొల్లయిండ్లు వద్ద జలజీవన్ మిషన్ కింద రూ.20.9లక్షల వ్యయంతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును ఎంపీటీసీ సభ్యులు లక్ష్మమ్మతో కలసి ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క పథకం కూడా అమలు చేయడంలేదని విమర్శించారు. పంచాయతీలో మొత్తం రూ.1.25కోట్లు వెచ్చించి తాగునీటి సమస్య పరిష్కరించినట్లు వెల్లడించారు. ఉప ముఖ్యమంత్రిగా నారాయణస్వామి దత్తత తీసుకుని కార్వేటినగరం అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం పల్లెసీమలను ఉన్నతంగా తీర్చిదిద్దారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు వెంకటేష్, గురుమూర్తి పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ సీపీ నేతకు నివాళి


అంజలి ఘటిస్తున్న కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం(కార్వేటినగరం): మండలంలోని పీవీ పురంలో గుండెపోటుతో మృతి చెందిన వైఎస్‌ఆర్ సీపీ నేత గోపాల్ భౌతికకాయానికి పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి నివాళులర్పించారు. సోమవారం ఈ మేరకు గోపాల్ కుటుంబీకులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలి

- ఆటోవర్కర్స్ యూనియన్ డిమాండ్


కరపత్రాలతో ఆటోయూనియన్ నాయకులు

నగరి: దేశవ్యాప్తంగా జీఎస్టీని అన్ని వస్తువులపై విధిస్తున్న కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ మాత్రం జీఎస్టీ పరిధిలోకి తీసుకొని రావడం లేదని వెంటనే జీఎస్టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్‌ను తీసుకురావాలని ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వేలన్ ఆటో వర్కర్స్ యూనియన్ పట్టణ నాయకులు శేఖర్, బాషా డిమాండ్ చేశారు. సోమవారం బస్టాండు ప్రాంగణంలో ఏఐటీయూసీ అనుబంధం జిల్లా 9వ మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో, టాక్సీ కార్మికుల సంక్షేమం కోసం చేపట్టే ఈ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు హరి, లాజర్, గోపాల్, బుజ్జి, అయ్యప్ప, నియోజకవర్గ కార్యదర్శి విజయ్ కుమార్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పల్లెల్లో పశువైద్య శిబిరం


పశువైద్య శిబిరంలో వెటర్నరీ వైద్య సిబ్బంది

శ్రీరంగరాజపురం(కార్వేటినగరం): మండలంలోని 48 బసివిరెడ్డిపల్లె, డీకే మర్రిపల్లెలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి శ్రీవిద్య మాట్లాడుతూ వైద్యశిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువులకు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని వెల్లడించారు. అలాగే శాస్త్రీయ యాజమాన్యంలపై పాడి రైతులకు అవగాహన సదస్సులు చేపడతామని వివరించారు. అనంతరం పశువులకు నట్టల నివారణ మందు అందించారు. పిడుదులను అరికట్టేందుకు మందు పిచికారీ చేశబూరు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే


ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు

నగరి: థామస్ ఆల్వా ఎడిసన్ బల్బు కనుగొన్న రోజును పురస్కరించుకొని ఎలక్ట్రీషియన్స్ డేను నగరి ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. థామస్ ఆల్వా ఎడిసన్‌కు జోహార్ చెబుతూ కేక్ కత్తిరించి సంబరాలు చేసుకున్నారు. బస్టాండు ప్రాంగణం నుంచి ఓంశక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నగరి మండల ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఎస్ రవి మాట్లాడుతూ చీకటి ప్రపంచానికి వెలుగునిచ్చిన థామస్ ఆల్వా ఎడిసన్ ప్రతి ఎలక్ట్రీషియన్‌కు ఆదర్శమన్నారు. అందుకే ఆయన బల్బు కనుగొన్న రోజును తాము ఎలక్ట్రీషియన్‌డేగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రమాదాన్ని లెక్కచేయక నిత్యం విద్యుత్ సంబంధిత వ్యవహారాల నడుమ కొనసాగేదే తమ వృత్తి అన్నారు. ఎవరికి ఏ అపాయం వచ్చినా వారికి అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు జిల్లా ఎలక్ట్రీషియన్ సంఘం ద్వారా పరిష్కరించుకుందామన్నారు. ఐక్యతతో ముందుకు వెళ్లినపుడే అది సాధ్యమన్నారు. సంఘ కార్యదర్శి ప్రభు, ట్రెజరర్ దామోదరం, సభ్యులు కేటీ శ్రీనివాసులు, కేపీ కుమార్, బాషా, ఈశ్వరన్, ఎంఎస్ మురళి, ఇంద్రయ్య, ఎన్‌సీ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమికి ప్రత్యేక ఏర్పాట్లు


మాట్లాడుతున్న డీవైఈఓ

నగరి: రథసప్తమి ఆర్జిత కల్యాణోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించుకుందామని డీవైఈఓ నాగరత్నమ్మ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలో టీటీడీ ఆధీనంలోని శ్రీకరియమాణిక్య స్వామివారి ఆలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు, సేవా సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 4వ తేదీ తేదీన నిర్వహించనున్న రథసప్తమి ఆర్జిత కళ్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆరాతీశారు. ఆరోజున ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు స్వామివారికి, దేవేరులకు తిరుమంజన సేవ, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఆర్జిత కళ్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. కళ్యాణోత్సవంలో పాల్గొనదలచిన వారు రూ.500 ఆలయ అధికారుల వద్ద చెల్లించి రశీదులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తుల సంఖ్యకు తగిన పందిళ్లు, ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకరణ, చేపడుతున్నామన్నారు. అధిక సంఖ్యలో ప్రసాద వినియోగం చేస్తామన్నారు. కల్యాణోత్సవ ఉభయదారులకు ఆలయం తరపున ప్రసాదాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రవి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఇన్‌స్పెక్టర్లు రమణ, గుణశేఖర్, ప్రధానార్చకులు ధన్వంతరి, రాంప్రసాద్, ఆలయ సిబ్బంది, సలహా సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


సారా ఊట చూపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది

సారా ఊట ధ్వంసం

విజయపురం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సోమవారం నగరి సర్కిల్ పరిధిలోని విజయపురం కేవీ పురంలో తనిఖీలు నిర్వహించారు. ఈ గ్రామానికి దక్షిణ, పడమర దిశలో ఉన్న చివ్వాడ చెరువు చుట్టూ నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3 వేల లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీదారుల కోసం గాలింపు చేపట్టినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపారు. సారా తయారీ, అక్రమ మద్యం, కల్తీ మద్యం విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు 14405కు ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ పోలీసు సిబ్బంది సిద్ధయ్య, రామచంద్ర, సురేంద్ర, విజయ్, గీత పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం


అవార్డు అందుకుంటున్న ప్రభాకర్

కార్వేటినగరం: గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆర్ఐ ప్రభాకర్‌ను సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఈ పురస్కారం మరింత బాధ్యత పెంచిందని వెల్లడించారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు


వడమాలపేట: కాయం జగనన్న కాలనీ సమీపంలో గ్రావెల్ తవ్వుతున్న భారీ జేసీబీ

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలంలోని కాయం గ్రామ రెవెన్యూ పరిధిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు వ్యాపారులు రేయింబవళ్లు దర్జాగా తవ్వి తరలించేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. పంచాయతీ రెవెన్యూ సిబ్బంది కనుసన్నల్లోనే తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా, గనుల శాఖ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. పలుకుబడి ఉన్న ఓ నాయకుడు పేరు చెప్పి అక్రమార్కులు తవ్వకాలు జరుపుతున్నారన్న ఆరోపణలున్నాయి. వ్యాపారులు పగలు రాత్రి తేడా లేకుండా గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. వందల సంఖ్యలో లారీలు వెళ్లడంతో జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది.


గుంతలమయంగా జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు

అనుమతులు లేవు

వడమాలపేట మండలం పరిధిలో గ్రావెల్ తవ్వకాలకు ఎక్కడా అనుమతుల్లేవు. కాయం పరిధిలో గ్రావెల్ తరలిస్తున్నట్లు మా దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

–జరీనా, తహసీల్దార్, వడమాలపేట

జనావాసాల్లో పందులు పట్టివేత


పందులు పడుతున్న వేటగాళ్లు

నగరి: పందుల పెంపకందారులకు మున్సిపల్ పరిధిలో ఎక్కడా పందులు మేపరాదంటూ మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఇచ్చిన చివరి గడువు సోమవారంతో ముగిసింది. దీంతో సోమవారం పందుల పట్టే వారిని రప్పించి జనావాసంలో ఉన్న పందులను పట్టివేయడం ప్రారంభించారు. దీంతో పందుల పెంపకందారులు హుటాహుటిన మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. తాము వీలైనంత మేరకు జనసంచారంలో పందులు మేపడం లేదని తెలిపారు. కొందరు మాత్రమే ఈ పొరపాట్లు చేస్తున్నారని, మరి కొంత గడువు ఇస్తే మరోసారి పొరపాటు జరగకుండా చూసుకుంటామన్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్ వారికి మరో ఏడు రోజులు గడువు ఇచ్చారు. ఆపై ఉపేక్షించేది లేదన్నారు.

సేవలకు ఉత్తమ అవార్డు


అవార్డు అందుకుంటున్న సీడీపీఓ

నగరి: ఐసీడీఎస్ శాఖ సీడీపీఓ కృష్ణవేణి అందించిన సేవలకు గాను ఆమెకు జిల్లాస్థాయి ఉత్తమ అవార్డులు అందాయి. చిత్తూరులో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. ఐసీడీఎస్ పరిధిలోని సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

కానరాని పంచాయతీ కార్యదర్శి


తాళం వేసి ఉన్న పంచాయతీ కార్యదర్శి గది

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలం పూడి సచివాలయంలో అధికారులు ఉండడం లేదని స్థానిక ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. పూడి సచివాలయ పరిధిలో 2 వేల కుటుంబాలు ఉన్నాయి. కాయం, పూడి, వేమాపురం పంచాయతీకి చెందిన చాలా మంది లబ్ధిదారులు వివిధ పనులు నిమిత్తం ఇక్కడకు వస్తుంటారు. అయితే అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. సచివాలయంలో మొత్తం 10 మంది సిబ్బంది ఉన్నారు. అయితే ముచ్చటగా ముగ్గురు కూడా ఉండడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

హార్టికల్చర్ అసిస్టెంట్‌పై ఫిర్యాదులు

- చర్యలు తీసుకోవాలంటూ బాధితుల డిమాండ్
- హార్టికల్చర్ ఆఫీసర్‌కు ఫిర్యాదు

పుత్తూరు: మండల పరిధిలోని ఉత్తరపుకండ్రిగ రైతు భరోసా కేంద్రంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ (వీహెచ్‌ఏ)గా పనిచేస్తున్న దీపికపై పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తన వద్ద నుంచి రూ.15 వేలు తీసుకొని మోసం చేసిందంటూ రాచపాళెం ఏఏడ బ్లూక్‌కు చెందిన కె.ధనమ్మ సోమవారం పుత్తూరు హార్టికల్చర్ ఆఫీసర్ వెంకటసౌజన్యకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఆమె మాట్లాడుతూ దీపిక రాచపాళెం ఆర్బీకేకు సైతం ఇన్‌చార్జి కావడంతో తనకు రావాల్సిన రైతు భరోసా లబ్ధి కోసం ఆమెను గత ఏడాది సంప్రదించినట్లు తెలిపింది. ఈ సందర్భంగా తన మామ పేరిట ఉన్న ఇంటి పట్టాను తన భర్త పేరిట మార్చుకోవాల్సి ఉందని తెలపగా, ఆ పని తానే చేసి పెడతానంటూ నమ్మబలికి అందుకు రూ.15 వేలుతో పాటు మామ పేరిట ఉన్న ఒరిజినల్ పట్టాను సైతం తీసుకొన్నట్లు తెలిపింది. నెలలు గడిచిపోతున్నా నేటికీ పని చేసి పెట్టకుండా, తీసుకొన్న డబ్బు, పట్టాను సైతం ఇవ్వకుండా తీవ్ర మనస్తాపానికి గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె గురించి ఉత్తరపుకండ్రిగ ఆర్బీకే కేంద్రానికి పలుమార్లు తిరుగుతున్నానని ఆమె కనిపించడం లేదని తెలిపింది. ఆ శాఖ అధికారులు తనకు న్యాయం చేయాలని అభ్యర్థించింది.


ఫిర్యాదు అందజేస్తున్న బాధితురాలు

దీపికపై ఆరోపణలు వాస్తవమే..

వీహెచ్‌ఏ దీపిక అవినీతి ఆరోపణలు నా దృష్టికి వచ్చాయి. గతంలోనూ వ్యవసాయ శాఖ ఇచ్చిన ఫర్టిలైజర్స్‌ను రైతులకు పంపిణీ చేయకుండా సొంత అవసరాలకు వాడుకుంది. వ్యవసాయ వస్తు సామగ్రి, వేరుశనగ విత్తనాలు ఇప్పిస్తానంటూ ఎస్బీఆర్‌పురం, పుత్తూరు తదితర గ్రామాల రైతుల నుంచి నగదు వసూలు చేసినట్లు సమాచారం ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం.

– వెంకటసౌజన్య, హార్టికల్చర్ అధికారి